ప్రాథమిక హక్కులు-ఆదేశ సూత్రాలు... ప్రాధాన్యం!!

''సామాజిక ఆమోదాన్ని పొంది, చట్టబద్ధత కలిగి సంఘంలోని వ్యక్తులందరూ అనుభవించే సదుపాయాలే'' హక్కులు. ఇవి మానవ మనుగడకు ఎంతో అవసరం. అందుకే వీటిని ప్రాథమిక హక్కులు అంటారు. ఆధునిక రాజ్యాంగాలన్నీ వీటిని ప్రస్తావిస్తాయి. మన రాజ్యాంగకర్తలు అమెరికా, ఐరిష్ రాజ్యాంగాల్లో ప్రస్తావించిన హక్కులను ఆదర్శంగా తీసుకొని,రాజ్యాంగంలోని మూడో భాగంలో పొందుపరచారు. ఫ్రెంచి విప్లవ కాలంలో చేసిన మానవ హక్కుల ప్రకటన.. ఐక్యరాజ్యసమితి ఆమోదించిన మానవ హక్కుల పత్రం.. మన రాజ్యాంగ కర్తలను ప్రభావితం చేశాయి. రాజ్య నిరపేక్షాధికారం నుంచి వ్యక్తి స్వేచ్ఛను పరిరక్షిస్తూ.. సమాజంలోని శక్తిమంతమైన వ్యవస్థలు, వ్యక్తులు తమ ఆధిపత్యాన్ని సామాన్య ప్రజలపై చెలాయించకుండా నిరోధించే చట్టబద్ధమైన ఈ హామీలు... సుప్రీం కోర్టు, హైకోర్టులు జారీ చేసే రిట్ల (ఉత్తర్వులు) ద్వారా అమలవుతాయి. ప్రాథమిక హక్కులతోపాటు, రాజ్యాంగంలోని నాలుగో భాగంలో పొందుపరిచిన ఆదేశ సూత్రాలు కూడా హక్కులే.ప్రాథమిక హక్కులు వ్యక్తి శ్రేయస్సుకు ప్రాధాన్యం ఇస్తే... ఆదేశసూత్రాలు సామాజిక సంక్షేమానికి పెద్దపీట వేస్తాయి. వీటిని ఐరిష్ రిపబ్లిక్ రాజ్యాంగం నుంచి గ్రహించారు.

రాజ్యాంగంలో 12 నుంచి 35 ప్రకరణల వరకు ప్రాథమిక హక్కుల వివరణ ఇచ్చారు.

12వ ప్రకరణ ప్రకారం-కేంద్ర,రాష్ట్ర, స్థానిక ప్రభుత్వాలు చేలాయించే అధికారం ప్రాథమిక హక్కులకు భంగం కలిగించకూడదు.

13వ ప్రకరణ(2వ క్లాజు) ప్రకారం- ప్రభుత్వం ప్రాథమిక హక్కులను తొలగించే, లేదా పరిమితం చేసే చట్టాలను చేయకూడదు. అయితే, 24వ రాజ్యాంగ సవరణ చట్టం ప్రకారం- 368వ ప్రకరణం కింద రూపొందించిన రాజ్యాంగ సవరణ ప్రాథమిక హక్కులను సవరించడానికి, తొలగించడానికి అనుమతినిస్తుంది (13(4)ప్రకరణ).

రాజ్యాంగంలో పొందుపరచిన హక్కులను ప్రధానంగా ఆరు రకాలుగా విభజించవచ్చు.

మొదటిది, సమానత్వపు హక్కు (14 నుంచి 18 ప్రకరణలు). దీని ప్రకారం- చట్టం దృష్టిలో సమానత్వం; మత, జాతి, కుల, లింగ, పుట్టుక ప్రాతిపదికన వివక్షత నిషేధం; ప్రభుత్వ ఉద్యోగాలు పొందే విషయంలో అందరికీ సమాన అవకాశాలు; అంటరానితనం నిషేధం; బిరుదులు నిషేధం. రెండోది, స్వాతం త్ర్యపు హక్కు(19 నుంచి 22 ప్రకరణలు). దీని ప్రకారం-పౌరులకు వాక్, భావ ప్రకటన స్వాతంత్ర్యం, సంఘాలుగా ఏర్పడటం,శాంతియుతంగా సమావేశం కావడం, భారత భూ భాగమంతా స్వేచ్ఛగా సంచరించడం, ఏ ప్రాంతంలోనైనా స్థిరనివాస మేర్పరుచుకోవడం, ఏదైనా వృత్తిని/వ్యాపారాన్ని నిర్వహించడం (ఆరు ప్రాథమిక స్వాతంత్ర్యాలు); అపరాధాల కోసం నేరస్థాపన విషయంలో రక్షణ; విద్యా హక్కు; ప్రాణ, వ్యక్తిగత



స్వాతంత్ర్య రక్షణ; కొన్ని సందర్భాలలో అరెస్టు, నిర్బంధం నుంచి రక్షణ. మూడోది, దోపిడీ నిరోధన హక్కు (23, 24 ప్రకరణలు). దీని ప్రకారం-మనుషుల క్రయవిక్రయాలు, బలవంతపు చాకిరి నిషే ధం; ఫ్యాక్టరీలు మొదలైన వాటిలో పిల్లలను పని చేయించడం నిషేధం. నాల్గోది, మత స్వాతంత్ర్యపు హక్కు (25 నుంచి 28వ ప్రకరణలు). దీని ప్రకారం-అంతరాత్మననుసరించి స్వాతంత్ర్యం; స్వేచ్ఛగా మతావలంబన, ఆచరణ, ప్రచార హక్కు; మత వ్యవహారాల నిర్వహణకు స్వాతంత్ర్యం; మతం పేరిట పన్నులు చెల్లించడం నిషేధం; విద్యా సంస్థలలో మత బోధన జరిగేటప్పుడు హాజరు కావాలని బలవంతంగా నిర్దేశించడం నిషేధం. ఐదోది, సాంస్కృతిక, విద్యా విషయాల హక్కు (29, 30 ప్రకరణ లు). దీని ప్రకారం- అల్ప సంఖ్యాక వర్గాలు తమ భాష, లిపి, సంస్కృతిని కాపాడుకునే హక్కు. అల్ప సంఖ్యాక వర్గాలు విద్యా సంస్థలు స్థాపించడానికి, నిర్వహించడానికి హక్కు. ఆరోది,రాజ్యాంగ పరిరక్షణ హక్కు. దీన్నే డా.అంబేద్కర్ 'రాజ్యాంగం ఆత్మ, గుండె' అని అభివర్ణించారు(32వ ప్రకరణ). పైన ప్రస్తా వించిన ఐదు రకాల హక్కుల అమలుకు రాజ్యాంగ పరిరక్షణ హక్కు ద్వారా హామీ లభిస్తుంది. దీని ప్రకారం-భారత సర్వోన్నత న్యాయ స్థానం కింద పేర్కొన్న రిట్లను జారీ చేయడం ద్వారా ప్రాథమిక హక్కులను పరిరక్షిస్తుంది. 226వ ప్రకరణ కింద హైకోర్టులు కూడా ఈ రిట్లను జారీ చేయవచ్చు. అవి: హెబియస్ కార్పస్, మాండమస్, కోవారంటో, ప్రొహిబిషన్, సెర్షియోరరి.

14, 20, 21, 23, 25, 27, 28 ప్రకరణల కింద సంక్రమించే హక్కులు భారతదేశంలో నివసించే స్వదేశీయులకు, విదేశీయులకు లభిస్తే... 15, 16, 19, 21ఎ, 30 ప్రకరణల ప్రకారం లభ్యమయ్యే హక్కులు భారత పౌరులకు మాత్రమే లభిస్తాయి. 352వ ప్రకరణ కింద అత్యవసర పరిస్థితి అమల్లో ఉన్నప్పుడు 19వ ప్రకరణ ప్రకారం లభ్యమయ్యే ఆరు ప్రాథమిక స్వాతంత్ర్యాలను తాత్కాలికంగా నిలిపివేయవచ్చు. అలాగే 20, 21 ప్రకరణల్లో ప్రస్తావించిన హక్కులు మినహా వేటి అమలుకైనా న్యాయస్థానాలను ఆశ్రయించే హక్కును రాష్ట్రపతి ఉత్తర్వు మేరకు నిలిపివే యొచ్చు.

36 నుంచి 51వ ప్రకరణ వరకు పొందుపరచిన ఆదేశసూ త్రాల్లో కొన్ని సామ్యవాద, మరికొన్ని గాంధీజీ తత్వ విచారాన్ని ప్రతిబిం

బిస్తే... మిగతావి ఉదారవాద స్వభావాన్ని కలిగి ఉన్నాయి. సమాన పనికి సమాన వేతనం, సంపద పంపిణీ, ప్రజలకు జీవనోపాధి, నిరుద్యోగ భృతి, కార్మికుల సంక్షేమం, వృద్ధుల, వికలాంగుల సంక్షేమం– సామ్యవాద స్వభావం కలిగినవి. పంచాయితీరాజ్ వ్యవస్థల ఏర్పాటు, షెడ్యూల్డ్ కులాల, తెగల సంక్షేమం, కుటీర పరిశ్రమల ప్రోత్సాహం, గోవధ నిషేధం, మద్యపాన నిషేధం–గాంధీజీ ఆశయాలకనుగుణమైనవి. ఉమ్మడి పౌరశిక్షా స్మృతి, వ్యవసాయాన్ని శాస్త్రీయ పద్ధతుల్లో నిర్వహిం చడం, పౌష్టికాహారం,అంతర్జాతీయ శాంతి, కార్యనిర్వాహక శాఖ నుంచి న్యాయ వ్యవస్థను వేరు చేయడం–ఉదారవాద అంశాలు.

42వ రాజ్యాంగ సవరణ చట్టం: ఉచిత న్యాయ సహాయం, కార్మికులకు యాజమాన్య నిర్వహణలో భాగస్వామ్యం, పర్యావరణం, అడవులు, వన్యజీవుల సంరక్షణ, పిల్లల ప్రగతికి తగిన అవకాశాలు కల్పించడం వంటి అంశాలు చేర్చింది.

44వ రాజ్యాంగ సవరణ చట్టం: ఆదాయం, హోదా, సదుపాయాలు, అవకాశాల విషయంలో అసమానతలను తగ్గించడం అనే అంశాన్ని చేర్చింది.

రాజ్యాంగం రూపకల్పన చేసిన రోజుల నాటి నుంచి ప్రాథమిక హక్కుల–ఆదేశికసూత్రాల ప్రాధాన్యతల విషయంపై రాజకీయ, మేధావి వర్గాల్లో విస్తృత చర్చ జరుగుతూనే ఉంది. మొదటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ అభిప్రాయంలో– ఈ రెండింటి మధ్య ఘర్షణ ఏర్పడినప్పుడు ఆదేశసూత్రాలకే ప్రాధాన్యతనివ్వాలి. సామాజిక శ్రేయస్సుకు ప్రాధాన్యాన్నిచ్చే ఆదేశసూత్రాలు... వ్యక్తి శ్రేయస్సుకు ప్రాధాన్యాన్నిచ్చే ప్రాథమిక హక్కుల కంటే శ్రేష్టమైనవి. సామాజిక సంక్షేమం, ప్రగతి–వ్యక్తిగత హక్కుల పరిరక్షణ ముసుగులో మరుగున పడకూడదు. సామాజిక శ్రేయస్సు దృష్ట్యా ప్రాథమిక హక్కులపై కొన్ని పరిమితులు విధించడంలో తప్పులేదని ఆయన అభిప్రాయపడ్డారు. వాస్తవానికి ఈ రెండింటి మధ్య ఘర్షణ లేదు; రెండూ అవినాభావ సంబంధం కలిగి ఉన్నాయి.

గత 60 ఏళ్లుగా ఆదేశసూత్రాల అమలు కోసం ప్రభుత్వం ఎన్నో చర్యలు చేపట్టింది. భూ సంస్కరణలను అమలు చేయడం ద్వారా సంపద కొద్దిమంది చేతిలో కేంద్రీకృతం కాకుండా నిరోధించింది. పంచాయితీరాజ్ వ్యవస్థలకు రాజ్యాంగ హోదాను కల్పించి, గాంధీజీ ఆశయాలను నెరవేర్చింది. కుటీర పరిశ్రమల ప్రోత్సాహానికి ఎన్నో చర్యలు చేపట్టింది. ప్రజల జీవన ప్రమాణాలు పెంచడానికి సామాజిక వికాసాభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించింది. ఇటీవల ప్రారంభించిన జాతీయ గ్రామీణ ఉపాధి పథకం ఇందుకు చక్కని ఉదాహరణ. విద్యా హక్కును ప్రాథమిక హక్కుగా రూపొందించడం, న్యాయవ్యవస్థను కార్యనిర్వాహక వర్గం నుంచి వేరు చేయడం మొదలైనవి మరికొన్ని ఉదాహరణలు. అయితే, ఆదేశసూత్రాల అమలుకు తీసుకుంటున్న చొరవ లు కొన్ని సందర్భాల్లో చట్టపరమైన వివాదాలకు దారితీసాయి. ప్రధానంగా ప్రాథమిక హక్కులకు భంగం కలిగిస్తున్నాయనే భావంతో న్యాయస్థానాల్లో ప్రభుత్వ చర్యలను సవాలు చేయడం... న్యాయస్థానాలు తదనుగుణంగా కొన్ని పరిమితులు విధించడం జరుగుతోంది. మొదటి రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా... 31ఎ, 31బి అంశాలు చేర్చి, భూ సంస్కరణల అమలు సందర్భంగా చేసిన చట్టాలను న్యాయస్థానాల్లో సవాలు చేయడాన్ని నిరోధిస్తున్నాయి. 25వ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా 31సి ని చేర్చారు.

దీని ప్రకారం–39 బి, ఇ ప్రకరణల్లో ప్రస్తావించిన ఆదేశసూత్రాలను (ప్రజా సంక్షేమానికి భౌతిక వనరులు వినియోగాన్ని నియంత్రించడం, ఆర్థిక వ్యవస్థ సామాజిక ప్రయోజనాలకు భంగకరంగా వ్యవహరించకుండా నిరోధించడం) అమలు చేయడానికి చట్టాలు చేసినప్పుడు... అవి 14, 19 ప్రకరణల్లో ప్రస్తావించిన ప్రాథమిక హక్కులకు (సమానత్వపు హక్కు, స్వాతం త్ర్యపు హక్కు) భంగం కలిగిస్తాయనే కారణంతో న్యాయస్థానాలు వీటిని చెల్లవని కొట్టివేయ కూడదు.

42వ రాజ్యాంగ సవరణ చట్టం ఆదేశసూత్రాల ఆధిక్యతను మరింత విస్తరిస్తూ... మిగతా ఆదేశసూత్రాల అమలు విషయంలో చేసిన చట్టాలు కూడా 14, 19 ప్రకరణల కంటే ఆధిక్యతను కలిగి ఉంటాయి. అయితే, ఈ సవరణను సుప్రీంకోర్టు మినర్వా మిల్స్ కేసు తీర్పు (1980) సందర్భంగా కొట్టివేస్తూ... 39బి, ఇ ప్రకరణల్లో పేర్కొన్న ఆదేశసూత్రాల అమలుకు చేసిన చట్టాలు మాత్రమే 14, 19 ప్రకరణల కంటే ఆధిక్యతను కలిగి ఉంటాయంది. మిగిలిన విషయాలలో ప్రాథమిక హక్కులదే పైచేయని పేర్కొంది. ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాలు రథానికి రెండు చక్రాల్లాంటివని... సామాజిక, ఆర్థిక పరమైన ప్రజాస్వా మ్యానికి సమానంగా అవసరమని అభిప్రాయ పడింది!!